**Andhra Jyothi**

# ఏపీపీఎస్సీలో కొలువుల జాతర!



- 4009 పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా
- 9 రకాల ఉద్యోగాల నియామకాలు
- సీసీ కెమెరాల నీడలో పరీక్ష: చైర్మన్ ఉదయ్‌భాస్కర్

గోకవరం, సెప్టెంబరు 30: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)లో కొలువుల జాతరకు తెరలేవనుంది. ఏపీపీఎస్సీ ద్వారా మొత్తం 4009 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో నోటిఫికేషన్ వెలువడిన 6 మాసాల్లోనే పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ మేరకు ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. శుక్రవారం కాకినాడలోని గోకవరం మండలం కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏపీపీఎస్సీ ద్వారా 4009 పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందన్నారు. నెగిటివ్ మార్కుల విధానం వల్ల ప్రతిభావంతులకు అవకాశం లభిస్తుందన్నారు. గ్రూప్-2, 3 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్షల నిర్వహణ ఉంటుందని, బయోమెట్రిక్ విధానం, సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు జరుగుతాయని చెప్పారు. స్క్రీనింగ్ టెస్టు ద్వారా అభ్యర్థుల వడపోత జరుగుతుందని, ఆ తర్వాత మిగిలిన పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. గడువు ముగుస్తున్న అభ్యర్థుల వయోపరిమితి మరో ఏడాది పెంచేలా ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ పరీక్షల ద్వారా 9 రకాల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు.